క్లుప్తంగా

కంప్యూటర్ పరీక్ష



కంప్యూటర్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొడంగల్ రూరల్: ఏఎస్ ఇన్స్టిట్యూట్‌లో శుక్రవారం నిర్వహించిన కంప్యూటర్ పరీక్షకు 90విద్యార్థులు హాజరయ్యారని ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ పద్మనాభరెడ్డి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వయం స్వశక్తి మిషన్ ఆధ్వర్యంలో వేసవిలో 45రోజుల పాటు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వగా.. 95మంది హాజరయినట్లు డైరెక్టర్ తెలిపారు.

ఎమ్మెల్యేతోనే అభివృద్ధి సాధ్యం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ వెంకటేశ్‌చారి

పెద్దేముల్: తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌చారి అన్నారు. శుక్రవారం బండపల్లి గ్రామంలో రూ.50లక్షలతో సీసీరోడ్డు, సైడ్ డ్రైనేజీ పనులను సర్పంచ్ రమేష్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీకి నిధులు మంజూరు చేయడం రోహిత్ రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాఘవేందర్, గ్రామ పెద్దలు రవి, బాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి



ఎస్‌ఐను సన్మానిస్తున్న దళిత యువశక్తి యువజన సంఘం నేతలు

కుల్కచర్ల: చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల దళిత యువశక్తి యువజన సంఘం మండల అధ్యక్షుడు భరత్ కుమార్, కన్వీనర్ అశోక్‌కుమార్ ఎస్‌ఐని కోరారు. శుక్రవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ శ్రీశైలంను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలు, కేసులపై అవగాహన లేకపోవడంతో అనవసరమైన వివాదాల్లో చిక్కుకుంటున్నారని, కావున వారికి చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సత్యసీలా రెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ద నర్సింహులు, నాయకులు వెంకట్రాములు, చుక్కయ్య, బాబు, శ్రీను పాల్గొన్నారు.

మేలుజాతి దూడల ప్రదర్శన



నాగసాన్‌పల్లిలో దూడలను ప్రదర్శిస్తున్న సర్పంచ్ వెంకటయ్య

ధారూరు: పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్టేషన్‌ధారూరు, డీకేతండా, నాగసాన్‌పల్లి, నర్సాపూర్ తదితర గ్రామాల్లో రైతులు మేలుజాతి దూడలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రేణుక, వెంకటయ్య, చంద్రయ్య, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నుపూస ఆపరేషన్ విజయవంతం

చేవెళ్ల: స్థానిక పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన వెన్నుపూస ఆపరేషన్ విజయవంతం అయినట్లు ఆస్పత్రి ఇన్‌చార్జ్ వినోద్ రెడ్డి తెలిపారు. చేవెళ్లకు చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలు వెన్ను నొప్పితో ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. ఆమె వెన్నుపూసలో సమస్య ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్స చేసినట్లు వివరించారు. ఆరోగ్య శ్రీ కింద వైద్యసేవలు అందించినట్లు వైద్యులు వెల్లడించారు.

సంక్షేమంలో నంబర్ వన్



తాండూరు రూరల్: లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

- కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ
- మత్స్యకారులకు చేయూత
- దశాబ్ది ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు

తాండూరు రూరల్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భవాని ఫంక్షన్‌హాల్లో సంక్షేమ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ప్రవేశ పెట్టినప్పటి నుంచి నియోజకవర్గంలో 9,454 లబ్ధిదారులకు రూ.87 కోట్ల 92 లక్షల 29 వేల 252లను చెక్కుల రూపంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా కుల వృత్తులకు రుణాలు అందజేశామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ అధికారిణి లలిత కుమారి, మైనార్టీ శాఖ అధికారిణి సుధారాణి, ఆర్డీఓ అశోక్‌కుమార్, ఎంపీపీ, జెడ్పీటీసీలు, తహసీల్దార్లు, ఎంపీడీఓ, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేయూత

అనంతగిరి: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వికారాబాద్ బ్లాక్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఫిష్ ఫెస్టివల్‌ను ఆమె సందర్శించి మాట్లాడారు. మిషన్ కాకతీయతో చెరువుల పూడిక తీస్తే వేసవిలోనూ చెరువుల్లో సమృద్ధిగా నీరు ఉందన్నారు. దీంతో చేపల పెంపకంతో మత్స్యకారుల అభ్యున్నతికి ఉపయోగపడిందని, సాగునీటికి కొదవ లేకుండా పోయిందని చెప్పారు. ఇదిలా ఉండగా.. వికారాబాద్‌లో నిర్మిస్తున్న జెడ్పీ కార్యాలయ నిర్మాణ పనులను సునీతారెడ్డి పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని నిర్మాణ దారులను ఆదేశించారు. డిప్యూటీ సీఈఓ సుభాషిణి, మత్స్యశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



అనంతగిరి: ఫిష్ ఫ్రై తయారీని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



బొంరాస్‌పేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

వాననీటిని ఒడిసిపట్టాలి

బొంరాస్‌పేట: వర్షాకాలంలో కురిసే ప్రతి చినుకును ఒడిసి పట్టాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తుంకిమెట్లలో చెక్‌డ్యామ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దుద్యాల మండలం గౌరారంలో గ్రామ పంచాయతీ నూతన భవనం, శ్మశానవాటిక ప్రహరీ, కమ్యూనిటీ షెడ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

సకాలంలో పంట రుణాలు

- పీఏసీఎస్ ఛైర్మన్ లక్ష్మారెడ్డి
- రూ.65 లక్షలతో ఎరువుల గోదాం ప్రారంభం



ఎరువుల గోదాంను ప్రారంభిస్తున్న ఛైర్మన్ లక్ష్మారెడ్డి

పెద్దేముల్: రైతులకు సకాలంలో పంట రుణాలు ఇస్తామని తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ లక్ష్మారెడ్డి చెప్పారు. శుక్రవారం సంఘం పరిధిలో రూ.65.48లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన ఒక వెయ్యి మెట్రిక్ టన్నుల ఎరువుల గోదాంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జులై మొదటి వారంలో రైతులకు ఖరీఫ్ పంట రుణాలు అందజేస్తామని, ఎకరాకు రూ.50వేల చొప్పున ప్రతి రైతుకు రూ.2లక్షల వరకు ఇస్తామన్నారు. అవసరం, అర్హులైన రైతులకు ట్రాక్టర్ రుణాలు, కోళ్ల ఫారమ్ కోసం బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయిస్తామని వెల్లడించారు. సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ముఖ్యంగా మొండి బకాయి చెల్లించాలని చెప్పారు. గత ఏడాది రూ.45 లక్షల వరకు ఎరువులు అందజేశామని, ఈ ఏడాది యూరియ 500 టన్నులు, డీఏపీ 100 టన్నులు, పొటాష్ 100 టన్నులు, కాంప్లెక్స్100 టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. తట్టెపల్లి పీఏసీఎస్‌తో పాటు నాగులపల్లి, ఇందూరు గ్రామాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో తాండూరు డీసీఎంఎస్ మేనేజర్ మనోహర్, సీఈఓ రాజమౌళి, ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నాయక్, ఉప సర్పంచ్ కిష్టప్ప, సూపర్ వైజర్ రాములు, పాలకవర్గం సభ్యులు బస్వరాజ్, శ్రీదేవి, చుక్కమ్మ, హన్మంతు, రహీం, దిగంబరం, మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్, గ్రామస్తులు వీరేశం, సంజప్ప, సిబ్బంది రాములు, జగదీశ్వర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

పూడూరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని సీడీఎస్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ చెప్పారు. శుక్రవారం తిర్మలాపూర్, మన్నెగుడ గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, న్యూట్రీషన్స్‌ఫుడ్ గురించి వివరించారు. పెళ్లీడు వస్తేనే వివాహం చేయాలని, బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని చెప్పారు. 2 నుంచి 5ఏళ్ల చిన్నారులను ఈ నెల 12న పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, కళావతి, మండల మహిళా అధ్యక్షురాలు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

- సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోండి
- డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి



విలేజ్ బస్ ఆఫీసర్స్ కార్యక్రమంలో డీఎస్పీ సంస్థ సిబ్బంది

పరిగి: ఆర్టీసీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో విలేజ్ బస్ ఆఫీసర్స్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రవాణా పరంగా ప్రజలకు సంస్థ ఎన్నో సేవలు అందిస్తుందని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, అందులో భాగంగానే విలేజ్ బస్ ఆఫీసర్స్‌ను సంస్థ ఏర్పాటు చేసిందని చెప్పారు. విలేజ్ బస్ ఆఫీసర్స్‌కు కేటాయించిన గ్రామాల్లో బస్‌స్టాప్ వద్ద ఆర్టీసీ బస్ సౌకర్యాల గురించి ప్రయాణికులకు తెలియజేస్తారని, సంస్థ సేవలను ప్రయాణికులు మరింత ఉపయోగించుకునేలా వారు కృషి చేస్తారని వెల్లడించారు. డీఎం పవిత్ర మాట్లాడుతూ విలేజ్ బస్ ఆఫీసర్స్‌ను కేటాయించడంతో ప్రయాణికులు ఆర్టీసీ సేవలను మరింత ఉపయోగించుకునేందుకు వీలుంటుందన్నారు. డిపో పరిధిలోని 28 గ్రామాల్లో ఈ ఆఫీసర్స్‌ను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు



కొడంగల్ చౌరస్తాలో నిలిచిన వాహనాలు

- రోడ్లపైనే వాహనాల నిలిపివేత
- ఇబ్బంది పడుతున్న పాదచారులు, వాహనదారులు

పరిగి: పరిగి పట్టణంలో పార్కింగ్ సమస్య తీవ్రత ఎక్కువైంది. రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు నిలపడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు పట్టణ కేంద్రానికి రోజువారీగా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో క్రయవిక్రయ దారులతో దుకాణాలు, రహదారి రద్దీగా ఉంటుంది. అదే సమయంలో వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలపడంతో ప్రధాన రహదారిపై వెళ్లే భారీ వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. బస్టాండ్ నుంచి కొడంగల్ చౌరస్తా వరకు ఇలాగే ఉంటుందని, బస్టాండ్ పరిసర ప్రాంతంలో దుకాణ సముదాయాలు ఎక్కువగా ఉండి.. వినియోగదారులతో కిక్కిరిసిపోయి ఉంటుందని, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకవడంతో సమస్య రోజురోజుకూ జటిలం అవుతుందని స్థానికులు చెబుతున్నారు.

సంత రోజుల్లో నరకమే

పట్టణంలో ప్రతి శుక్ర, శనివారం ఈ రెండు రోజులు సంత జరుగుతుండడంతో.. రైతులు, వ్యాపారులతో అంగడి ప్రాంతం రద్దీగా ఉంటుంది. సంత గంజ్‌రోడ్డులో ఉండడంతో సంత రోజుల్లో రోడ్లపై ప్రయాణించాలంటే నరకం చూడాల్సిందేనని వాహనదారులు వాపోతున్నారు. ఇరుకైన రోడ్లు ఉండడం, వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండి ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి.. ట్రాఫిక్ సమస్యకు పరిష్కార మార్గం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

సమన్వయంతోనే పల్లెల్లో ప్రగతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

బంట్వారం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేస్తేనే గ్రామాల్లో ప్రగతి సాధిస్తామని కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జరిగిన కోట్‌పల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం సంపూర్ణంగా ఉంటుందని, హరితహారం నాటికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఈజీఎస్ సిబ్బందికి చెప్పారు. నాటిన ప్రతి మొక్కను బతికిస్తే పల్లెలు పచ్చగా ఉంటాయన్నారు. మిషన్ భగీరథ నీటి వృథాను అరికట్టాలని సంబంధిత అధికారులకు ఎంపీపీ చెప్పారు. పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా చూడాలని, వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ముసరకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశాన్ని అధికారులు ఆషామాషిగా తీసుకోవద్దని, గైర్హాజరైన వారిపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్‌కు లేఖ రాస్తామని చెప్పారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు ఎజెండాలోని అంశాలను సభలో సభ్యులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉమాదేవి, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ అష్పక్ రసూల్, ఎంపీఓ డానియల్, కరీంపూర్, బార్వాద్ ఎంపీటీసీలు బందెయ్య, నర్సింహారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సుపరిపాలన దినోత్సవం

కొడంగల్ : రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం తెలంగాణ సుపరిపాలన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. నియోజవర్గంలోని అన్ని మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, వాటి ఫలితాలను ప్రజలకు వివరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రార్థనాలయాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

కొడంగల్ రూరల్: హిందూ, ముస్లిం దేవాలయాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం. గౌసన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక మక్కా మసీద్‌లో మాట్లాడారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రార్థనాలయాలకు ఉచిత విద్యుత్తును అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జబ్బార్‌సాబ్, సయ్యద్ ఇసాక్, జావెద్ హుస్సేన్, సయ్యద్ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం ప్రారంభం నేడు

దౌల్తాబాద్: నందారంలో శనివారం నూతన శివాలయం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ మహాదేవమ్మ తెలిపారు. శివాలయంతో పాటు ధ్వజస్తంభం, నందీశ్వరుడు, శివలింగం, గణపతి, సుబ్రహ్మణ్యం, నాగులవిగ్రహాల ప్రతిష్ఠాపన చేయనున్నట్లు చెప్పారు. 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే పల్లెబాట

కుల్కచర్ల: పల్లెబాట కార్యక్రమంలో భాగంగా శనివారం చౌడాపూర్ మండలంలో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి పర్యటించనున్నారని బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు మేగ్యా నాయక్ తెలిపారు. చిన్నమేగ్య తండా, నీర్సాబ్ తండా, చాకల్‌పల్లి, మొగుల్లపల్లి, కిష్టంపల్లి, మరికల్, కల్మన్‌కాల్వ, బగ్రంపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, నేతలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వీరశైవ సమాజ అభివృద్ధికి చేయూత



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి

- ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

తాండూరు టౌన్: వీరశైవ సమాజ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చెప్పారు. వీరశైవ సమాజ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఆయన ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడు ఆర్ బస్వరాజ్, గౌరవ అధ్యక్షుడు వాలి శాంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు సడిగి భద్రప్ప, ప్రధాన కార్యదర్శి లింగదల్లి రవికుమార్, సహాయ కార్యదర్శి అబులం సంపత్, కోశాధికారి వాలి శ్రావణ్‌కుమార్, నిర్ని చంద్రశేఖర్, గంగా శ్రావణ్ కుమార్‌లు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ 25 ఏళ్లుగా వీరశైవ సమాజ అభివృద్ధికి తన వంతు చేయూత అందిస్తున్నాని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ రవూఫ్, రవిగౌడ్, వడ్డే శ్రీనివాస్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

దోమ: సంజీవ స్వామి దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ అశోక్‌రెడ్డి కోరారు. శుక్రవారం దొంగఎన్కెపల్లిలో గ్రామస్తులతో కలిసి ఆలయ ప్రాంగణంలో గుడి పునర్నిర్మాణ విషయంపై సర్పంచ్ మాట్లాడారు. దేవాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకు రావాలన్నారు. ఈ నెల 11వ తేదీన అందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, దాతలు, గ్రామస్తులు రావాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, గ్రామస్తులు పులెందర్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, సంజీవ్‌కుమార్, ఆంజనేయులు, అశోక్, యాదయ్య, సాయిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాడుబడిన ప్రభుత్వ కార్యాలయాలు



తుంకిమెట్లలో నిరుపయోగంగా ఉన్న అటవీశాఖ కార్యాలయం

- నిర్మాణ వ్యయం వృథా
- పట్టించుకోని అధికారులు

బొంరాస్‌పేట: కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిరుపయోగంగా మారాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పటిచుకోకపోవడంతో అవి వినియోగంలోకి రాకుండా పోయాయని, తద్వారా ప్రజాధనం వృథా అయిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం సంబురాలు జరుపుకొంటున్నా.. అభివృద్ధిలో భాగంగా నిర్మించిన భవనాలు పాడుబడుతున్నా.. వాటి గురించి ఏఒక్కరూ పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉందని వాపోతున్నారు. మండల కేంద్రంలో నాలుగేళ్ల క్రితం నిర్మించిన గ్రంథాలయ భవనం నిరుపయోగంగా ఉంది. పదిహేనేళ్ల క్రితం తుంకిమెట్లలో నిర్మించిన అటవీశాఖ బీట్ అధికారి కార్యాలయం పాడుబడిపోయింది. గ్రామంలోని బీజాపూర్–హైదరాబాద్ జాతీయ రహదారికి ఆనుకొని ఫారెస్టు బీట్ అధికారి కార్యాలయం నిర్మించారు. ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు అది వినియోగంలోకి రాలేదు. దీంతో తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. మూడేళ్ల క్రితం ప్రత్యేక నిధులు కేటాయించి మళ్లీ మరమ్మతులు చేసి రంగులు అద్దారు. అయినప్పటికీ వృథాగానే పడుండటం గమనార్హం. ఇప్పటికైనా ఫారెస్టు బీట్ అధికారి భవనం, గ్రంథాలయం భవనం వినియోగంలోకి వచ్చేలా సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బంజారాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



పరిగి: బంజార భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: బంజారాల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగి పట్టణ కేంద్రానికి మంజూరైన బంజార భవన నిర్మాణానికి మండల పరిధి రంగాపూర్‌లో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బంజారాల జీవితాలను మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వారికి రిజర్వేషన్లు కల్పించి ఉద్యోగ, రాజకీయ అన్ని రంగాల్లోనూ రాణించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. సంక్షేమ పథకాలు అందజేస్తూ.. వారి అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారంతో ఆర్థికాభివృద్ధి చెందాలి

దోమ: కోళ్ల ఫారంతో రైతులు ఆర్థికాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. మోత్కుర్ గ్రామంలో బంక చెన్నయ్య అనే రైతుకు చెందిన కోళ్ల ఫారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయంతో పాటు లాభదాయకమై మార్గాలను రైతులు ఎంపిక చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షుడు మల్లయ్య, బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి శశిధర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేశం, గ్రామస్తులు శ్రీనివాస్, చంద్రయ్య, వెంకటయ్య, పాండు, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో..

పూడూరు: ప్రభుత్వం కార్పొరేషన్‌ల ద్వారా ఇస్తున్న రుణాలను యువత సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సోమన్‌గుర్తిలో ఏర్పాటు చేసిన సైబర్ కమ్యూనికేషన్ షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత సాంకేతిక రంగంలో రాణించాని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుచ్చన్న, కెరవెళ్లి మాజీ సర్పంచ్ మధుసూదన్, నాయకులు మౌలాన, ఆదిల్, అయూబ్ పాల్గొన్నారు.